# జైహింద్
## –పుట్టగంటి గోపీకృష్ణ



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

**గుహలో** దాక్కున్న పులిని చంపటం ఎంతో తేలిక. గుహ ముఖద్వారం కర్రలతో మూసి వేసి మంట పడితే చాలు గుహలో చేరిన పొగ పులిని ఊపిరాడకుండా చేసి చంపేస్తుంది.

తిరిగి కిందకు దిగి వచ్చింది చేవా. కొన్ని ఎండు పుల్లలు, ఎక్కువ మొత్తంలో ఎండు గడ్డి పోగు చేసింది. వాటిని పైకి చేర్చటం మామూలుగానే కష్టం. అలాంటిది అడుగు వెడల్పు లేని ఆ కొండ దారిలో మరింత కష్టం. అయినా ఆమె వెరవ లేదు. కట్టెల మోపు మీద గడ్డి మోపులు కట్టి వాటిని తాడుతో లాగుతూ పైకి చేరవేసింది.

అప్పటికే చీకటి ముసురుకుంటోంది. గుహకు అడ్డంగా ముందు ఎండు గడ్డి వేసి తరువాత కట్టెలు పేర్చింది. వాటికి నిప్పు పెట్టింది. కట్టెలు పచ్చిగా ఉండి పెద్దగా నిప్పు రావటం లేదు. పొగ మాత్రం బాగా వస్తోంది. చేవాకు కావలసింది కూడా అదే... లోపల ఉన్న పులి చవిపోయేది మంటకు కాదు, పొగకు. గాలి వాలు కూడా ఆమెకు సహకరిస్తూ, వస్తున్న పొగను గుహ బయటకు కాకుండా లోపలకు నెడుతోంది.

తను చేయవలసిందంతా చేశాను కాబట్టి కిందకు వెళ్లి ఒక గంట తరువాత వద్దామనుకుని వెనక్కి తిరిగింది చేవా.

నాలుగడుగులు ముందుకు వేసి నడి నెత్తిన పిడుగు పడినట్లు ఆగిపోయింది ఆమె.

ఎదురుగా పెద్దపులి. దారికి అడ్డుగా నిలబడి సూటిగా చేవా వైపే చూస్తోంది.

చేవాకు కుడి వైపున తల నిట్టనిలువుగా ఎత్తి చూస్తే తప్ప శిఖరం కనిపించని కొండ చరియలు. కుడి వైపున తల వంచి చూస్తే తప్ప నేల కనిపించని లోయ. కింద అడుగు వెడల్పు కూడా లేని దారి.

వీపున ఉన్న విల్లు తీసే వెసులుబాటు లేదు. నడుముకు ఉన్న ఛురిక ఎందుకూ పనికి రాదు. ఏమి చెయ్యాలో అర్థం కాక స్థాణువులా నిలబడి పోయింది చేవా,

ఎదురుగా ఉన్న పులిది కూడా అదే పరిస్థితి. అది నిన్న రాత్రి వేటాడింది. తెచ్చిన జంతువుతో కడుపు నింపుకుంది. ఆడ తోడును వెతుక్కుంటూ ఉదయాన్నే బయటికి పోయింది. ఇప్పుడే వనక్కి వస్తోంది. ఎదురుగా కనిపించిన మనిషిని చూసి అది కూడా డోలాయమానంలో పడింది. ఎప్పుడూ దాడి చేయని మనిషి మీద దాడి చేస్తే కలిగే మంచి చెడులను గురించి బేరీజు వేసుకుంటోంది అది.

చేవా ఆశ్చర్యం నుండి తేరుకుంది. పులి గుహలో లేదని తన ఎదురుగా ఉందని అర్థమయింది. ఇప్పటిదాకా తను చేసిన పని అంతా వృథా. ఇప్పుడు ఎదురుగా ఉన్న పులిని వదిలేస్తే ఇక మరో అవకాశం రాత్రి లోపు మళ్లీ రాక పోవొచ్చు. అప్పుడు మొసలిని వేటాడిని వాడు తాండాకు నాయకుడు అవుతాడు. తను వాడికి పెళ్లాం కావాలి.

ఆ మాట ఊహించుకోగానే ఆమెకు ఎదురుగా ఉన్న పులి క్రూరంగా కనిపించటం మానివేసింది. అది తన విజయానికి ఉన్న ఏకైక మార్గంగా కనిపించింది. అంతే! అది తన మీద దాడి చేస్తుందేమో అన్న భయం నుండి ఆమె విముక్తి పొందింది. భుజాలను విదిలించి విల్లును కింద పడేసింది. ఎదురుగా ఉన్న పులి లక్ష్యంగా పరుగు పెట్టింది.

పులికి ఏమీ అర్థం కాలేదు. తన మీదకు దూసుకు వస్తున మనిషిని ఎదుర్కోవాలా, వెను తిరగాలా అని నిర్ణయం తీసుకునే సమయం దానికి కూడా చిక్కలేదు. పెద్దగా ఆలోచించకుండా అది కూడా వెనుక కాళ్లలోకి సత్తువ తెచ్చుకుని గాల్లోకి లేచింది.

సూడిగాలిలా ముందుకు పరుగెత్తుతున్న చేవా తను కూడా గాల్లోకి ఎగిరింది. గాలిలోనే పులిని అడ్డుకుని పక్కకు తోసింది. ఇద్దరు అఘాతం లోకి పడిపోతున్నారు. పడిపోతున్న ఇద్దరి కాళ్లూ గాల్లో ఆధారం వెతుక్కుంటూ కొట్టుకుంటున్నాయి.

కొన్ని యుగాల్లా అనిపించిన ఆ క్షణాలు అంతలోనే అంతరించి... ముందు పులి, దాని మీద చేవా కింద ఉన్న రాళ్ల మీద పడ్డారు. సూది మొనల్లా ఉన్న కొండ శిలల మీద పడటంతో పులి తీవ్రంగా గాయపడింది. పులి మీద తను పడటంతో చేవా చిన్న దెబ్బలతో బయట పడింది.

అంత ఎత్తు నుండి బయట పడిన షాక్ నుండి చేవా తేరుకునేటప్పటికి పులి చనిపోయింది.

చేవా ఆనందానికి అవధులు లేవు. తను అనుకున్నది సాధించింది. తాండాలో యువకులెవరూ ఊహలో కూడా సాధించలేనిదాన్ని తను చేసి చూపించింది. ఇప్పుడు ఈ పులిని తెల్లవారేలోపు తాండాకు చేర్చాలి. అప్పుడే పూర్తి విజయం సాధించినట్లు.

చెట్ల కొమ్మలను కలిపి కట్టి, దాని మీదకు చనిపోయిన పులిని చేర్చి తాళ్లతో కట్టి, లాగుతూ ముందుకు సాగింది.

ఆ తెల్లవారుజామున చనిపోయిన పులితో ఆమె తాండా చేరింది. డాచెన్ ఆనందానికి అవధులు లేక పోయింది. ఇక ఆమెను తదుపరి నాయకురాలిగా ప్రకటించినా ఎవరి నుండి అబ్యంతరాలు రావు అనుకున్నాడతను.

అయితే మొసలిని వేటాడి తెచ్చిన యువకుడు చేవా నాయకురాలు కావటాన్ని జీర్ణించుకోలేక పోయాడు. సైమూన్ నగరంలో ఉంటున్న జపాను అధికారుల దగ్గరకు వెళ్లి తమ తాండాలో బ్రిటిషు దళాలకు ఆశ్రయం దొరుకుతోందని, దానికి కారణం తాండా నాయకుడు డాచెన్, అతని కూతురు చేవా అని చెప్పాడు.

వ్యూహాత్మకంగా వీరి తాండా కీలకమయిన ప్రదేశంలో ఉండటంతో జపాను అధికారులు కూడా వెంటనే స్పందించారు. తమకు వచ్చిన వార్త నిజమయిందో, కాదో నిర్ధారించుకోకుండానే వారిని అరెస్ట్ చేయటానికి నిర్ణయం తీసుకున్నారు.

చేవాని తాండా నాయకురాలిగా ఎక్కుకోవాల్సిన సమయానికి జపాను పోలీసులు అక్కడకు వచ్చారు. అయితే ఎప్పుడో కానీ రాని పోలీసులు అడవిలోకి వస్తున్న విషయం ముందుగానే డాచెన్‌కి తెలిసింది. వారు ఎందుకు వస్తున్నారో కూడా తెలిసింది. తనని పోలీసులు బంధించినా పరవాలేదు, కూతురుని అరెస్ట్ చేయటం అన్న భావననే డాచెన్ తట్టుకోలేక పోయాడు.

"నువు ఇక్కడ నుండి వెళ్ళిపో..." అన్నాడు చేవాతో.

"ఎక్కడకు వెళ్లాలి?" తాండాను వదిలి వెళ్లాల్సి వస్తున్న బాధతో అంది చేవా.

"ఎక్కడకయినా వెళ్ళు. కానీ ఈ దేశంలో మాత్రం ఉండవద్దు. ఇక్కడ ఉంటే వాళ్లు ఇవాళ కాకపోతే రేపయినా పట్టుకుంటారు..." అన్నాడు డాచెన్. "అంతేకాదు, నువు ఎక్కడకు వెళ్లబోతున్నావో ఆ విషయం మన తాండాలో కూడా ఎవరికీ చెప్పకు. వాళ్లలోనే ద్రోహులు ఉన్నారు." అని కూడా చెప్పాడు.

"నువు కూడా రా నాన్నా, వెళ్దాం..." అంది చేవా.

"వద్దమ్మా! నేను ఇక్కడే ఉండాలి. ఈ కష్టాలు శాశ్వతం కాదు. కానీ ఈ తాండా శాశ్వతం. ఎవడో ఒకడు చేసిన ద్రోహం కారణంగా, నేను పారిపోను. నువు తిరిగి వచ్చే నాటికి ఈ తాండాని నీ నాయకత్వం కోసం సిద్ధంగా ఉంచుతాను..." అన్నాడు డాచెన్.

తను ఎప్పటి నుండో దాచి ఉంచిన కొంత డబ్బును ఆమెకు ఇచ్చాడు డాచెన్.

హడావుడిగా ఒక చిన్న సంచిలో రెండు బట్టలు పెట్టుకోబోతుంటే వాటి మధ్య ఎప్పుడో దాచిన ఇండియన్ నేషనల్ ఆర్మీలో చేరమన్న కరపత్రం కనిపించింది.

తను ఎక్కడకు వెళ్లాలో అప్పుడు ఒక స్పష్టత వచ్చింది చేవాకు.

1943, జులై 15...

సింగపూర్ లోని పదాంగ్ స్క్వేర్ ఆజాద్ హింద్ ఫౌజ్ మొదటి మార్చ్ ఫాస్ట్‌కి సిద్ధమవుతోంది.

మేజర్ జనరల్ కియానీ ముందుండి సుప్రీం కమాండర్ సుభాస్ చంద్ర బోస్‌కి గౌరవ వందనం సమర్పిస్తున్నాడు.

జపాను ఆర్మీ తరుపున జనరల్ యమగుచి, మేజర్ నవసాకి అతిధులుగా ఆ పెరేడ్‌లో పాల్గొన్నారు.

ఆజాద్ హింద్‌ఫౌజు లోని మూడు డివిజన్లు పెరేడ్‌లో పాల్గొన్నాయి.

వాటితో పాటు AFV బెటాలియన్ (Armoured Fighting Vehicle), హేవీ గన్ బెటాలియన్ మాత్రమే కాకుండా నాలుగు కంపెనీల ఏంటీ ఎయిర్‌క్రాఫ్ట్ గన్ యూనిట్లు పాల్గొన్నాయి.

ప్రపంచంలోనే మొదటిసారి అందరూ ఆడవారే ఉండే రాణీ ఝాన్సీ రెజిమెంట్ కెప్టెన్ లక్ష్మి నాయకత్వంలో పెరేడ్‌లో పాల్గొంది.

ఆడవారు సెల్యూట్ చేస్తూ ముందుకు వెళ్తుంటే యమగుచి విసుగ్గా తల పక్కకు తిప్పుకున్నాడు. “ఈ బోస్ కొన్ని విషయాల్లో ఎందుకంత మూర్ఖంగా ప్రవర్తిస్తాడో అర్ధం కాదు. ఆడవారితో కలిసి యుద్ధం రంగంలోకి వెళ్లటం అంటే ఒక చేతిని కట్టి వేసుకుని యుద్ధం చేసినట్లే…” అన్నాడు.

“అందరు ఆడవాళ్లతో ఈ రెజిమెంట్ ఏర్పాటు చేస్తున్నారని తెలియగానే నేను బోసుతో మాట్లాడాను. ఆయన నా సలహా వినకపోగా నాకు లోకం తీరు తెలియటం లేదన్నాడు.” చెప్పాడు నవసాకి.

“స్త్రీ సమానత్వం గురించి చర్చించటానికి ఇది సోషల్ క్లబ్ కాదు, యుద్ధ రంగం…”

“అది కూడా అయింది. ఆడవాళ్లను యుద్ధం రంగంలోకి పంపితే వారిని కాపాడుకునే బాధ్యత కూడా మగ సైనికుల మీద పడుతుందని, అది మన సైనికుల సామర్ధ్యాన్ని తగ్గిస్తుందని చెప్పాను.”

“మరి ఏమన్నాడు?”

“నా దేశపు స్త్రీలు ఆకాశంలో సగం. అవకాశాల్లో సగం మాత్రమే కోరుకోరు… బాధ్యతలు కూడా సగానికి సగం పంచుకుంటారు. ఏ మగ సైనికుడు కూడా తన తోటి ఆడ సైనికురాలిని ఒక బాధ్యతగా భావించనవసరం లేని శిక్షణ వారికి ఇప్పిస్తాను… అన్నాడు.” అని చెప్పాడు నవసాకి. బోసు చెప్పిన ఇంకొక మాట అతను చెప్పలేదు. “వీరికి శిక్షణ ఇచ్చిన తరువాత, ఇదే ఆడవారి చేత గెరిల్లా దళాలు ఏర్పాటు చేయిస్తాను. ప్రపంచంలోనే బెస్ట్ యూనిట్ అని మీచేతే అనిపిస్తాను…” అన్నాడు బోసు తన ఆడపడుచులను తక్కువ చేసి చూస్తున్న నవసాకితో.

ఇంతలో వారి ముందుకు షా నవాజ్ ఖాన్ నేత్రుత్వంలో సుభాస్ బ్రిగేడ్ వచ్చింది.

“ఇతను ఇండియన్ మిలటరీ అకాడెమీ నుండి స్వోర్డ్ ఆఫ్ ఆనర్ అవార్డ్ గెలుచుకున్నాడట కదూ…” అన్నాడు యమగూచి.

“అతని సామర్ధ్యం మీద నాకు ఎలాంటి అపనమ్మకం లేదు. కానీ అతను ముస్లిమ్.”

“అయితే?”

"సైన్యంలో అత్యంత సీనియర్ పొజిషన్‌లు కియానీకి, షా నవాజ్ ఖాన్ కి ఇచ్చాడు బోసు. వారిద్దరు ముస్లిములు. వారి కింద పనిచేయ వలసిన సైనికులేమో హిందువులు. వారి సైనికుల నుండి ఎంత వరకు సహకారం అందుతుందో ఏమో? నాకయితే అనుమానమే..." అన్నాడు నవసాకి.

తరువాత వరుసగా గాంధీ రెజిమెంట్, నెహ్రూ రెజిమెంట్, ఆజాద్ రెజిమెంట్‌లు తమ ఉనికిని చాటాయి.

వరుసగా వస్తున్న దళాల పేర్లు చూసిన నవసాకి పక్కకు తిరిగి, "యమగూచీ! నువ్వు గమనిస్తే ఇక్కడ నీకు మరో విచిత్రం కనపడుతుంది. బోసుకు గాంధీ, నెహ్రూ అంటే ఇష్టం లేదు. కానీ తన మిలటరీ దళాలకు మాత్రం వారి పేర్లు పెట్టుకున్నాడు..."

"ఎందుకంటావ్?"

"వారితో తన వైరుధ్యం సిద్ధాంత పరమే తప్ప వ్యక్తిగతం కాదని చెప్పటానికేమో..."

తరువాత బోస్ తన అధ్యక్ష ఉపన్యాసం చేశాడు.

ఆ ఉపన్యాసంలో బోసు ఒక మాట మాట్లాడినపుడు సైన్యంతో పాటు అక్కడ హాజరయిన జనం కొట్టిన చప్పట్లతో పరిసరాలు దద్దరిల్లాయి.

"ఏమంటున్నాడతను?" అడిగాడు యమగూచి.

'నాకు మీరు రక్తం ఇవ్వండి, మీకు నేను స్వాతంత్రం ఇస్తాను...' అన్న మాటను జపాను భాషలోకి అనువాదం చేసి చెప్పాడు నవసాకి.

"బ్రహ్మాండం..." మెచ్చుకోకుండా ఉండలేకపోయిన యమగూచి తను కూడా చప్పట్లు కొట్టాడు.

మరొకసారి చప్పట్లతో సభ మారుమోగినపుడు నవసాకి తనే బోసు మాటలను తర్జుమా చేసి చెప్పాడు.

"స్వాతంత్రం ఒకరు ఇస్తే తీసుకునే భిక్ష కాదు, శక్తితో సాధించుకునే హక్కు..." అన్న బోసు మాటలకు జపాను జనరల్, సభకు వచ్చిన వారే కాదు, దేశ వ్యాప్తంగా ఉన్న యువకులు ప్రభావితమయ్యారు. ఆజాద్ హింద్ ఫౌజులో చేరటానికి సింగపూరుకు తరలి వచ్చారు.

తరువాత తన మిలటరీలో కొన్ని విప్లవాత్మక మార్పులు ప్రవేశ పెట్టాడు బోస్.

అప్పటి వరకు బ్రిటిషు సైన్యంలో కులాల వారీగా వంటశాలలు ఉండేవి. ఆ పద్ధతి మార్చిన బోసు అందరికి ఒకే వంటశాల ఏర్పాటు చేశాడు.

కేవలం నోటి మాటలు చెప్పటం మాత్రమే కాదు, సుప్రీం కమాండర్‌గా తను ఎల్లపుడు నీటుగా ఉండే యూనిఫాం ధరించి ఉండేవాడు. సింగపూరులో ఉండే ఉక్కపోత వాతావరణంలో కూడా ఫీల్డు బూట్లు వేసుకునే వాడు.

సిపాయిలతో కలిసి భోజనం చేసేవాడు.

అధికారులు ఇచ్చే సూచనలు స్వీకరించటానికి ఎప్పుడూ తయారుగా ఉండేవాడు.

అందరికీ ఉత్కృష్టమయిన శిక్షణ అందే ఏర్పాట్లు చేశాడు. పోషణతో కూడిన భోజనం అందేలా చూశాడు.

తన వరకు తాను ఎప్పుడూ ఆత్మవిశ్వాసంతో కనిపించేవాడు. తన మాటలో, తన బాడీ లాంగ్వేజిలో ఒక సుప్రీం కమాండర్ ప్రదర్శించాల్సిన దర్పం ప్రదర్శించే వాడు.

ఇక మిలటరీ వ్యూహాల విషయంలో జర్మనీలో చూసి వచ్చిన అధునాతన పద్ధతులను ఆచరించే వాడు.

గుడ్ మార్నింగ్, గుడ్ ఈవినింగ్ లాంటి ఇంగ్లీషు గౌరవ వాక్యాలను పక్కన పెట్టి ప్రతి ఒక్కరు 'జైహింద్' అంటూ పలుకరించుకోవాలని నిబంధన విధించాడు.

ప్రతి రోజు రేడియో ద్వారా భారత దేశ ప్రజలకు తన సందేశం చేరవేసేవాడు. బ్రిటిషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్ర వ్యాఖ్యలు చేసేవాడు.

బెంగాలులో దుర్భిక్షంతో చనిపోతున్న ప్రజల కోసం లక్ష టన్నుల ఆహార ధాన్యాలు సమీకరించి పంపించగలనని, తమ ఓడలు భారత తీరానికి రావటానికి అనుమతి ఇవ్వమని కోరిన బోసు కోరికను బ్రిటిషు ప్రభుత్వం అంగీకరించలేదు.

ఆ కరువులో 30 లక్షల మంది సరయిన తిండి లేక చనిపోయారు. బోసు తన దాడిలో పదును మరింత పెంచాడు.

ఎన్ని పనులు ఉన్నా, కొన్ని పనులు స్వయంగా తనే చేసేవాడు బోసు.

జపాను ప్రభుత్వం తనని ఏ పని కోసం పిలిపించిందో, ఆ పని ఇంకా మిగిలే ఉంది. అదే ప్రవాసంలో భారత ప్రభుత్వాన్ని ఏర్పరచటం.

తెల్లవారితే ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.

ఏర్పాటు చేయబోయే ప్రభుత్వంలో కాబోయే ప్రచార శాఖ మంత్రి అయ్యర్ హడావుడిగా బోసు దగ్గరకు వచ్చాడు.

“సార్! మనం ప్రభుత్వాన్ని రేపు ఏర్పాటు చేస్తున్నామని చెప్తున్నాం. ఇంతవరకు మన ప్రభుత్వ లక్ష్యం ఏమిటి అంటే ఏమి చెప్పాలో సరిగ్గా ఎవరికీ తెలియదు. అదీకాక… రేపు మన ప్రభుత్వ ఏర్పాటు సంగతి ప్రపంచ వ్యాప్తంగా ఒక ప్రముఖ వార్త అయ్యేలా మనమే ఒక పత్రికా ప్రకటన విడుదల చెయ్యాలి…” అన్నాడు అయ్యర్.

“చెయ్యండి… ఎవరు వద్దన్నారు?” అన్నాడు చిరునవ్వుతో బోసు. బోసు మిలటరీ యూనిఫాంలో ఎంత గంభీరంగా ఉండేవాడో, ఆ డ్రస్ విప్పి లాల్చీ, పంచెలోకి మారిపోయాక అంతే జోవియల్‌గా ఉండేవాడు. అరటి కాయ ధరల గురించి వంటవాడితో, కారు నడిపే వేగం మీద డ్రైవరుతో ఎప్పుడూ జోకులు వేస్తూ ఉండేవాడు.

“సార్! మీరు బేసిక్ ఐడియా ఇస్తే… మిగిలింది నేను రాయిస్తాను.”

సమయం చూసుకున్నాడు బోసు. అర్ధరాత్రి కావొస్తోంది. ఇప్పుడు తను క్లుప్తంగా చెప్పి, వేరెవరో దానిని విపులీకరించి, తిరిగి తాను దాన్ని దిద్దేకంటే… సరాసరి తనే రాయటం నయమని నిశ్చయించుకున్నాడు. “ఒక పని

చెయ్యండి. మీరు నాకు అరగంటకొక కాఫీ కప్పు అందించండి. మిగిలింది నేను చూసుకుంటాను..." అంటూ తెల్ల కాగితాలు అందుకున్నాడు బోసు.

ఎడమ చేతిలో వెలుగుతున్న సిగరెట్ పట్టుకుని కుడి చేతిలో ఉన్న పెన్సిల్‌తో కాగితాల మీద రాస్తూ పోయాడు బోస్. ఒక్క క్షణం ఆలోచించింది లేదు. ఒక్క క్షణం మాటల కోసం తడుముకున్నది లేదు. ఆయన రాసిన కాయితాన్ని రాసినట్లు టైప్ చేయటానికి తీసుకు వెళ్తున్నారు. మొత్తం టైపింగ్ పూర్తయ్యాక ప్రకటనలో ఒక్క ముక్క కూడా మార్చవలసిన అవసరం రాలేదు.

పని మొత్తం పూర్తయ్యాక, "ఎంతయింది?" అని అడిగాడు బోసు.

"పది కాఫీలు, ఇరవై సిగరెట్లు ఖర్చయ్యాయి..." ఎప్పుడు వచ్చాడో పక్కన నిలబడి ఉన్న బోసు వ్యక్తిగత డాక్టర్ చెప్పాడు.

"నేనడిగింది టైము ఎంత అయిందని?"

"నేను చెప్పింది మీ ఆరోగ్యాన్ని ఎంత ఖర్చు పెట్టారో..."

"అప్పుడప్పుడూ చిన్న చిన్న సరదాలు తప్పు లేదులే డాక్టర్."

"అప్పుడప్పుడూ అయితే నేనూ ఏమీ అనక పోదును. ఇంకాసేపట్లో తెల్లవార వస్తోంది. రేపు భారత దేశ చరిత్రలోనే ముఖ్యమయిన రోజు. ఆ చరిత్ర రచించబోతోంది మీరు. మీరు రాత్రి అంతా నిద్ర పోకుండా ఉండటం భావ్యమేనా? నిద్రని గాలికి వదిలి ఇన్ని సిగరెట్లు, ఇన్ని కాఫీలు తాగుతూ మధ్యమధ్యలో ఆ వక్కపొడి నములుతూ..." ఆవేదనగా అంటూ ఆగిపోయాడు డాక్టర్.

నవ్వేస్తూ డాక్టర్ భుజం తట్టాడు బోసు. తనకు వ్యక్తిగత అవసరాలు తక్కువ. అతని లగేజిలో రెండు జతల బట్టలతో పాటు... ఒక రుద్రాక్ష మాల, ఒక చిన్న భగవద్గీత పుస్తకం, ఒక స్పేరు కళ్లజోడు మాత్రమే ఉండేవి. కానీ సిగరెట్లు, వక్కపొడి, కాఫీలు, టీలు మాత్రం చాలా ఇష్టం. డాక్టరు చెప్పినా వాటిని వదల లేక పోయాడు.

"కనీసం ఇక పడుకోండి..." కోపంగా అన్నాడు డాక్టర్.

"ఆల్రెడీ వెలుతురు వచ్చేస్తోంది డాక్టర్. ఇంకా పడుకునేదేమిటి?" అంటూ తన పెంపుడు జంతువులు ఉండే ఏరియా దగ్గరకు వెళ్లి పోయాడు బోస్.

తల విదిలించి అవతలకు వెళ్ళి పోయాడు డాక్టర్.

బోసుకు ఉన్న మరో హాబీ పెంపుడు జంతువులను పెంచటం. అవి కూడా అందరూ పెంచుకునే కుక్కలు, పిల్లులు కాదు. గాయపడిన జంతువులను, అసహాయంగా కనిపించిన జంతువులను పెంచుతూ ఉండేవాడు. ప్రస్తుతం సింగపూరులో అతని దగ్గర అయిదు కోతులు, మూడు గొర్రెలు, పదికి పైగా కుందేళ్ళు, బాతులు, రాబందులు, ఒక చిన్న

గుర్రం పిల్లా ఉన్నాయి. ఉదయాన్నే కాసేపు వాటితో గడిపి తరువాత మరి కాసేపు బాడ్మింటన్ ఆడి అప్పుడు ఫ్రెష్ అవుతాడు బోస్.

యధాప్రకారం తన దినచర్యలో నిమగ్నమయిన ఆయన్ని చూసి, "ఈయనకు ఇవాళ తారీకు ఎంతో, ఈరోజు ఏం జరగబోతుందో గుర్తుందా?" అనుకున్నారు ఆయన అనుచరులు

1943, అక్టోబర్ 21.

సింగపూరు లోని హాండే రోడ్డులో ఉంది కాథే బిల్డింగ్.

1939 లో 11 అంతస్తులతో నిర్మించిన కాథే బిల్డింగ్ అప్పటికి ఆగ్నేయ ఆసియాలో అత్యంత ఎత్తయిన బిల్డింగ్. దాని గ్రౌండ్ ఫ్లోరులో కాథే సినిమా, డాన్స్ హాల్, రెస్టారెంట్ ఉన్నాయి. మిగిలిన వాటి మాట ఏమో కానీ, 1300 మంది ప్రేక్షకులు పట్టే కాథే సినిమాహాల్ సింగపూర్‌లో మొదటి ఎయిర్ కండిషన్డ్ సినిమా హాల్.

పై అంతస్తులలో జపాను వారి రేడియో స్టేషన్ ఉండేది. దానితో పాటు ఆజాద్ హింద్ రేడియో స్టేషన్ ప్రసారాలు కూడా ఈ భవనం నుండే జరిగేవి.

ప్రస్తుతం భారత దేశ ప్రభుత్వ ఏర్పాటుకు కాథే సినిమా హాలు వేదిక అయింది.

ఆ హాలును రంగురంగుల బ్యానర్లతో అలంకరించారు. ఎక్కడ చూసినా త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది. తేడా అల్లా... ఇప్పుడున్న అశోక చక్రం స్థానంలో రాట్నం ఉంది.

జపాను ప్రభుత్వం తరుపున యమమోటో హాజరయ్యాడు. వివిధ దేశాల నుండి వచ్చిన డెలిగేట్లు సభకు నిండుతనం తెచ్చారు. వేదిక అంతా ప్రపంచ వార్తా ప్రసార సాధనాల మైకులతో నిండి పోయింది.

ముందుగా హిందీలోకి అనువాదం చేసిన రవీంద్రనాథ్ ఠాగోర్ జనగణమన గీతాన్ని పాడారు. దానినే జాతీయ గీతంగా తరువాత సభ ఆమోదించింది. అలానే హిందుస్తానీని జాతీయ భాషగా, రూపాయిని భారతీయ కరెన్సీ యూనిట్‌గా కూడా సభ నిర్ణయించింది.

ఆజాద్ హింద్ ఫౌజ్ గార్డ్ ఆఫ్ ఆనర్ సమర్పించింది.

మిలటరీ బాండ్ తమ ధీరత్వాన్ని ప్రదర్శించే పాట పాడి వినిపించింది.

హమ్ దెహలీ దెహలీ జాయెంగే
హమ్ అపనా హింద్ బనాయెంగే
అబ్ ఫౌజీ బనకే రహనా హై
దుఖ్–దర్ద్, ముసీబత్ సహనా హై

సుభాష్ కా కహనా–కహనా హై
చలో దెహలీ చల్‌కే రహనా హై
హమ్ దెహలీ దెహలీ...

హమ్ గోలీ ఖాకే ఝూమెంగే
హమ్ మౌత్ కో బడకర్ చూమెంగే
మత్‌వాలే బన్ ఆజాదీ కే
హమ్ దరియా జంగిల్ ఘూమెంగే
హమ్ దెహలీ–దెహలీ...

సుభాష్ హమారా సాథ్ హీ హై
ఔర్ రాస్‌బిహారీ సాథ్ హై
ఫిర్ కైసే ఖతరా బాకీ హై
ఖుదా హమారా సాథీ హై
హమ్ దెహలీ–దెహలీ...

హమ్ ఫౌజీ బన్‌కే జాయెంగే
హమ్ దెహలీ తక్ జాయెంగే
జాలిమ్ ఫిరంగీ కౌమ్ కా
హమ్ నామీ నిషా మిటాయెంగే
హమ్ దెహలీ–దెహలీ

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS